క్లుప్తంగా

గ్రామాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న డీఎల్‌డీఓ శ్రీనివాసరెడ్డి

కొనకనమిట్ల: గ్రామ పంచాయతీల అభివృద్ధిపై పంచాయతీ కార్యదర్శులు దృష్టి పెట్టాలని డీఎల్‌డీఓ కె.శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. గురువారం సాయంత్రం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. పారిశుధ్యంపై దృష్టి సారించాలని, క్లాప్ మిత్రల పనితీరును పర్యవేక్షించాలని కార్యదర్శులకు సూచించారు. ప్రభుత్వ సర్వేలను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని చెప్పారు. ఎంపీడీఓ ఈశ్వరమ్మ, ఈఓపీఆర్డీ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం



విద్యార్థులకు డైరీలు అందిస్తున్న దాత, ఉపాధ్యాయులు

కంభం: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహకరించడం అభినందనీయమని మండలంలోని జంగంగుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గని వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. పూర్వ విద్యార్థి సబ్బసాని వెంకటరంగారెడ్డి పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు రూ.30 వేల విలువచేసే డైరీలు, కాపీ రైటింగ్ పుస్తకాలు అందజేశారు. గత ఏడాది నుంచి పాఠశాలకు మినరల్ వాటర్ కూడా అందిస్తున్న పూర్వ విద్యార్థిని హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయులు సన్మానించారు.

రాగసముద్రంలో నీటి కష్టాలు



రాగసముద్రంలో రామాలయం వద్ద పని చేయని చేతిపంపు

తర్లుపాడు: వర్షాలు పడకపోవడంతో గ్రామాల్లో నీటి కష్టాలు తీవ్రమవుతున్నాయి. డీప్‌బోర్లు, చేతిపంపులకు మరమ్మతులు చేసి ప్రజల నీటి కష్టాలు తీర్చాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. తర్లుపాడు మండలంలోని రాగసముద్రంలో డీప్‌బోర్లు, చేతి పంపులు కొన్ని నెలలుగా మరమ్మతులకు గురై అలంకారప్రాయంగా మారాయి. దీంతో గ్రామస్తులు దూర ప్రాంతాల నుంచి నీరు తెచ్చుకోలేక అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి నీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రభుత్వ కళాశాల విద్యార్థికి విట్‌లో ఉచిత అడ్మిషన్



సర్టిఫికెట్ అందుకుంటున్న భవాంజనేయులు

పొదిలి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి ఎస్.భవాంజనేయులు అమరావతిలోని విట్ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్(సైబర్ సెక్యూరిటీ)లో ఉచిత సీటు పొందాడు. ఇంటర్మీడియెట్‌లో 967 మార్కులతో ప్రకాశం జిల్లా బాయ్స్ విభాగంలో ప్రతిభ కనబరచడంతో సపోర్ట్ ద అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ రూరల్ స్టూడెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా అడ్మిషన్ దక్కిందని ప్రిన్సిపాల్ కె.వాసుదేవ్ తెలిపారు. విద్యార్థిని ప్రిన్సిపాల్‌తోపాటు అధ్యాపకులు ఉండేల నరసారెడ్డి, పి.సుజాత, పి.రమణారెడ్డి, ఎల్.పద్మారావు అభినందించారు. భవిష్యత్‌లో ఉన్నత స్థానాలు పొంది తల్లిదండ్రులకు, కళాశాలకు మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

కంభం: స్థానిక అర్బన్ కాలనీలోని ఉర్దూ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంఈఓ–2 టి.శ్రీనివాసులు గురువారం పరిశీలించారు. బడిలో పాఠ్యాంశాలతోపాటు సహపాఠ్య కార్యక్రమాల అమలుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని ప్రశంసించారు. విద్యార్థి మిత్ర కిట్లకు సంబంధించిన బయోమెట్రిక్ అథెంటికేషన్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచాయతీల గల్లా పెట్టె ఖాళీ!

- 15వ ఆర్థిక సంఘం నిధుల కోసం ఎదురుచూపులు
- తొమ్మిది నెలలుగా అవస్థలు
- రెండో విడత నిధుల విడుదల ఎప్పుడో?

బేస్తవారిపేట:

కూటమి ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు కేటాయించే నిధుల్లో కోత పెడుతుండటంతో సర్పంచ్‌లు, అధికారులు ఏ పని చేయాలన్నా ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామ పంచాయతీలు 15వ ఆర్థిక సంఘం, స్టాంప్‌డ్యూటీ, సీనరేజ్ గ్రాంట్, వృత్తి పన్నుల పైనే ఆధారపడి ఉన్నాయి. పంచాయతీల్లో నిర్వహణ ఖర్చులు అమాంతంగా పెరిగిపోవడంతో వచ్చిన నిధులు పారిశుధ్య కార్మికుల వేతనం, మైనర్ రిపేర్ల ఖర్చులకు కూడా సరిపోవడం లేదు. కొన్ని పంచాయతీల్లో పారిశుధ్య కార్మికులు వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పంచాయతీలో ప్రజలకు అవసరమైన సదుపాయాల కల్పనకు సంబంధించి ఏమైనా పనులు చేయాలన్నా నిధుల కొరతతో ముందడుగు వేయలేకపోతున్నారు.

పెరిగిన నిర్వహణ ఖర్చులు

నియోజకవర్గంలో 95 పంచాయతీలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయించి వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలని ప్రగల్భాలు పలికింది. చేసిన ప్రతి కార్యక్రమానికి గ్రామ పంచాయతీ నుంచే తీసుకోవాలని చెప్పడంపై సర్పంచ్‌లు తీవ్రంగా మండిపడుతున్నారు. వీటికి తోడు గ్రామ పంచాయతీల్లో ట్రైసైకిళ్ల నిర్వహణ, విద్యుత్ బకాయిలు, పైపులైన్ సమస్యలు, ఓహెచ్‌ఆర్‌లు, పారిశుధ్య పనులు పెరిగిపోయాయి. దీంతో చేసిన పనులకే దిక్కులేకుండాపోగా, అధికారులు నిత్యం పంచాయతీలను తనిఖీలు చేసి ఉన్నఫలంగా సమస్యలను పరిష్కరించాలని ఆదేశిస్తుండటంతో అదనపు ఖర్చులు పెరిగిపోతున్నాయని వాపోతున్నారు.



బేస్తవారిపేట పంచాయతీ కార్యాలయం

తొమ్మిది నెలలుగా నిధుల కొరత..

2024–25 సంవత్సరానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు విడుదల చేసే 15వ ఆర్థిక సంఘం నిధులను మొదటి విడుత కింద సెప్టెంబర్ 3వ తేదీన విడుదల చేశారు. ఆ నిధులతోనే కాలం నెట్టుకొస్తున్నారు. రెండో విడత నిధులను కూడా కేంద్రం విడుదల చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం వాటిని విడుదల చేయలేదనే విమర్శలున్నాయి. ఒక్కో పంచాయతీలో దాదాపుగా పారిశుధ్య కార్మికులకు నెలకు రూ.25 వేలు ఖర్చు వస్తోంది. ప్రస్తుతం కార్మికులు వేతనం అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

ప్రచార ఆర్భాటాలకే ప్రాధాన్యత

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రచార ఆర్భాటాలకే ప్రాధాన్యత ఇస్తోంది. అధికారంలోకి వచ్చిన వెంటనే పంచాయతీలో స్వాతంత్ర్య దిన వేడుకలు ఘనంగా నిర్వహించాలని డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ తెలిపారు. అయితే వేడుకలకు నిధులు అందిస్తారని అందరూ భావించగా.. పంచాయతీల నుంచే వాడుకోవాలని జీఓ జారీ చేయడంపై సర్పంచ్‌లు మండిపడుతున్నారు. పంచాయతీలకు జీవం పోశామని పదేపదే చెబుతున్నా నిధుల విడుదలలో మాత్రం తీవ్ర జాప్యం జరుగుతోందని మండిపడుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే పంచాయతీల నిర్వహణ మరింత దారుణంగా మారడం ఖాయమని చెబుతున్నారు.

ప్రజల పక్షాన పోరాడదాం

- వైఎస్సార్ సీపీ శ్రేణులతో సమావేశంలో 'అన్నా'



మేకలవారిపల్లిలో మాధవరావును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నా

తర్లుపాడు: ప్రజల పక్షాన పోరాటం చేస్తూ వారి అభిమానాన్ని తిరిగి సంపాదించాలని వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులకు ఆ పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు దిశానిర్దేశం చేశారు. గురువారం మండలంలోని మేకలవారిపల్లి, కలుజువ్వలపాడు, లక్ష్మక్కపల్లి, తుమ్మలచెరువు గ్రామాల్లో అన్నా రాంబాబు పర్యటించారు. తాజా రాజకీయ పరిణామాలపై నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. ఇటీవల అనారోగ్యానికి గురైన పార్టీ కార్యకర్తలు మేకలవారిపల్లికి చెందిన మాధవరావు, కలుజువ్వలపాడుకు చెందిన చిన్నగాలెయ్య, షేక్‌మౌలాలి, లక్ష్మక్కపల్లికి చెందిన గాలెయ్య, తుమ్మలచెరువుకు చెందిన షేక్ రసూల్‌ను పరామర్శించి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మురారి, ఎంపీపీ రామసుబ్బారెడ్డి, సర్పంచ్‌లు రమణారెడ్డి, రామిరెడ్డి, షాజహాన్, పార్టీ ముఖ్యనాయకులు కొండారెడ్డి, శివారెడ్డి, మహేష్‌రెడ్డి, వైస్ సర్పంచ్ శాంతరావు, శేషయ్య, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడు చిన్న కొండారెడ్డి మృతి

గిద్దలూరు రూరల్: మండలంలోని ఆదిమూర్తిపల్లె గ్రామ సర్పంచ్ పర్వత వెంకటసుబ్బమ్మ మామ పర్వత చిన్నకొండారెడ్డి అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని వైఎస్సార్ సీపీ గిద్దలూరు ఇన్‌చార్జి కె.పి.నాగార్జునరెడ్డి సందర్శించి ఘన నివాళులు అర్పించారు. సర్పంచి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పార్టీకి ఆయన అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అర్ధవీడు ఎంపీపీ వెంకటరావు, బేస్తవారిపేట ఎంపీపీ ఓసూరారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు బి.ఓబులరావు, బొర్రా కృష్ణారెడ్డి, రామయ్య, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చిన్నకొండారెడ్డికి నివాళులర్పిస్తున్న కేపీ నాగార్జునరెడ్డి

21న వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం

- గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

గిద్దలూరు రూరల్: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ గిద్దలూరు ఇన్‌చార్జి కేపీ నాగార్జునరెడ్డి కోరారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 21వ తేదీన గిద్దలూరులోని విఠా సుబ్బరత్నం కల్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్టీని క్షేత్ర స్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త నాయకుడు కలిసి కృషి చేయాలన్నారు. ప్రజల్లో పార్టీపై అంతులేని అభిమానం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికార దుర్వినియోగం చేస్తూ వైఎస్సార్ సీపీ శ్రేణులను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో పరిపాలన కొనసాగించినప్పుడే ప్రజలు స్వాగతిస్తారన్న విషయాన్ని కూటమి సర్కారు గుర్తుంచుకోవాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు గుర్తించి ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతిపక్ష పార్టీపై ఉందన్నారు. అందులో భాగంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిరంతరం పోరాడేందుకు సిద్ధంగా ఉందన్నారు. అనంతరం పార్టీ నాయకుడు చేరెడ్డి శ్రీకాంత్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బేస్తవారిపేట ఎంపీపీ ఓసూరారెడ్డి, అర్ధవీడు ఎంపీపీ వెంకటరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మానం బాలిరెడ్డి, బత్తిని ఓబులరావు, డా.భూమా నరసింహారెడ్డి, సీఆర్‌ఐ మురళి, పగడాల శ్రీరంగం, చేగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, పాలుగుళ్ల సుబ్బారెడ్డి, గోడి వెంకటేశ్వరరెడ్డి, బొర్రా కృష్ణారెడ్డి, పాలుగుళ్ల నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేపీ నాగార్జునరెడ్డి

సెకండ్ సమ్మర్..!



నిర్మానుష్యంగా మార్కాపురం కోర్టు సెంటర్



గొట్లగట్టులో ఎండ దెబ్బకు గొడుగుతో..

మార్కాపురం/కొనకనమిట్ల: ఎండ దెబ్బకు జనం విలవిల్లాడుతున్నారు. జూలై మూడో వారంలో కూడా మే మాసాన్ని తలపించేలా భానుడు నిప్పులు చెరుగుతుండటంతో ఉక్కపోత, వడగాడ్పులతో తల్లడిల్లుతున్నారు. పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల్లో గత పది రోజుల నుంచి 38 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదవుతోంది. ఉదయం 9 గంటల నుంచే ఎండ తీవ్రత ప్రారంభమై మధ్యాహ్న సమయానికి ఉష్ణోగ్రత అధికం కావడంతో ప్రధాన వీధులు సైతం బోసిపోతున్నాయి. ఆషాఢ మాసం ఆఫర్లు పెట్టినప్పటికీ ఎండ దెబ్బతో జనం దుకాణాలకు రావడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా వాన జాడ లేకపోవడం, అధిక ఉష్ణోగ్రత కారణంగా పత్తి, సజ్జ, కంది పైర్లు వాడుముఖం పడుతున్నాయి. మొలక దశలోనే ఎండిపోతున్న పైరును కాపాడుకునే దారి తెలియక రైతులు ఆందోళన చెందుతన్నారు.

కార్మికులు సమ్మెలో.. చెత్త వీధుల్లో..!



చెత్తను పోగు చేసి తగలబెడుతున్న కొబ్బరి బొండాల వ్యాపారి



రోడ్డు మీదనే చెత్త కుప్పలకు నిప్పు

గిద్దలూరు రూరల్: పట్టణంలో పారిశుధ్యం దారుణం తయారైంది. గిద్దలూరు పట్టణ పంచాయతీలో పారిశుధ్య కార్మికులు 57 మంది, ఇంజినీరింగ్ విభాగంలో కార్మికులు 33 మంది మంగళగిరిలో ధర్నాకు హాజరయ్యారు. పారిశుధ్య, ఇంజినీరింగ్ విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మెలోకి వెళ్లడంతో ఎక్కడి సమస్యలు అక్కడే తిష్టవేశాయి. గిద్దలూరు పట్టణంలోని రాచర్ల గేటు సెంటర్, కుమ్మరాంకట్ట సెంటర్, కొమరోలు బస్టాండ్ రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్, గణేష్ నగర్ వంటి ప్రధాన రోడ్లు చెత్తతో నిండిపోయాయి. మంగళవారం దుకాణాల ముందు పేరుకుపోయిన చెత్తను వ్యాపారులే తొలగించుకుంటూ కనిపించారు. కొందరు వ్యాపారులు రోడ్డుపై చెత్త పోగు చేసి నిప్పు పెట్టారు. మరికొందరు వ్యాపారులు దుర్వాసన భరించలేక దుకాణాలు తెరవడమే మానుకున్నారు.

పట్టణంలోని నల్లబండ బజారు, రాచర్ల రోడ్డు, కృష్ణా థియేటర్ సమీపంలో గల సగిలేరు సప్లయ్ చానల్లో తొలగించిన పూడిక కుప్పలుగా వేసి, వారం రోజులుగా తొలగించలేదు. పట్టణంలోని విశ్వభారతి స్కూల్, కొంగలవీడు రోడ్డు, డీఆర్‌ఆర్ అపార్ట్‌మెంట్ వీధుల్లో చెత్త రోడ్ల మీద ఉన్నప్పటికీ పట్టించుకునే వారు కరువయ్యారు. పట్టణంలోని రాజానగర్‌లో పుట్టవద్ద రెండు విద్యుత్ స్తంభాలకు వీధి లైట్లు వెలగని కారణంగా రాత్రి సమయంలో రాకపోకలకు స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.



కాలువలో పూడిక తీసి రోడ్డు మీదే వదిలేసిన దృశ్యం



రాజానగర్‌లో వెలగని వీధిలైట్లు



దుకాణం ముందు పేరుకు పోయిన చెత్త

కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



ర్యాలీలో నినాదాలు చేస్తున్న కార్మికులు

పొదిలి: కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పొదిలిలో సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు ర్యాలీ నిర్వహించి, సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. కార్మికులకు రావాల్సిన వేతన బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు.

గ్యాస్ సిలిండర్ల ఆటో బోల్తా



కొమరోలు: గ్యాస్ సిలిండర్లతో వెళుతున్న ఆటో బోల్తా పడింది. ఈ సంఘటన మండలంలోని తంబళ్లపల్లె గ్రామానికి వెళ్లే రహదారిలో జరిగింది. వివరాల్లోకి వెళితే..గిద్దలూరు నుంచి గ్యాస్ లోడ్ ఆటో గ్రామాలకు వెళ్లి తిరిగి గిద్దలూరు వెళుతుండగా మలుపు వద్ద అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో ఖాళీ గ్యాస్ సిలిండర్లు రహదారిపై చెల్లాచెదురుగా పడ్డాయి. ఆటో డ్రైవర్ ప్రేమ్‌రాజ్‌కు, సహాయకుడికి గాయాలయ్యాయి. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులకు సహాయ సహకారాలు అందించారు. ఖాళీ సిలిండర్లు కావడంతో పెద్ద ప్రమాదమే తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

పర్యావరణ పరిరక్షణ కోసం యాత్ర



ముత్తు సెల్వన్‌ను అభినందిస్తున్న ఎంపీడీఓ

కొనకనమిట్ల: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కోరుతూ కోయంబత్తూరుకు చెందిన ముత్తు సెల్వన్ తన సైకిల్ యాత్ర చేస్తూ ప్రజలకు అవగాహన కలిపిస్తున్నారు. గురువారం ఆయన సైకిల్ యాత్ర కొనకనమిట్లకు చేరింది. విషయం తెలుసుకున్న స్థానిక ఎంపీడీఓ ఈశ్వరమ్మ ముత్తు సెల్వన్‌ను తన కార్యాలయానికి పిలిచి యాత్ర విశేషాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ, కార్యాలయ ఉద్యోగులు ముత్తు సెల్వన్‌ను అభినందించి సన్మానించారు. ఆర్థిక సహాయం అందించి యాత్ర దిగ్విజయంగా కొనసాగించాలని ఆకాంక్షించారు.

స్పీడుకు వేయరా బ్రేకులు?



రోడ్డుపై తొలగించిన స్పీడ్ బ్రేకర్

మార్కాపురం: ఈనెల 4వ తేదీన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మార్కాపురం పర్యటన సందర్భంగా ఆయన ప్రయాణం సాఫీగా సాగాలని అల్లూరి పోలేరమ్మ గుడి వద్ద నుంచి పాతబస్టాండు వరకు, జీజీహెచ్ వైద్యశాల వద్ద, గుండ్లకమ్మ బ్రిడ్జి వద్ద ఉన్న స్పీడ్ బ్రేకర్లను అధికారులు తొలగించారు. స్పీడ్ బ్రేకర్లను తిరిగి ఏర్పాటు చేసే అంశాన్ని రెండు వారాలైనా పట్టించుకోకపోవడంతో నిత్యం రద్దీగా ఉండే కంభం, తర్లుపాడు రోడ్డులో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇక్కడ హైస్కూళ్లు, హాస్పిటల్స్, ఆలయాలు ఎక్కువగా ఉన్నాయి. స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో వాహనాలు హైస్పీడ్‌తో వెళ్తున్నాయి. ముఖ్యంగా సాయంత్రం పూట స్కూల్స్ వదిలే సమయంలో కొందరు ఆకతాయి యువకులు బైకులపై విన్యాసాలతో జనాన్ని భయపెడుతున్నారు. సాయంత్రం పూట 6 నుంచి 8 గంటల మధ్య తర్లుపాడు రోడ్డులో యువకులు హల్‌చల్ చేస్తున్నారు.

స్పీడ్ బ్రేకర్లు నిర్మించాలి



మార్కాపురం పట్టణంలో 20 రోజుల క్రితం తొలగించిన స్పీడ్ బ్రేకర్లను ఆర్‌అండ్‌బీ అధికారులు వెంటనే ఏర్పాటు చేయాలి. ప్రధానంగా కోర్టు సెంటరులో ఉన్న స్పీడ్ బ్రేకర్ తొలగించడంతోవాహనాల స్పీడుకు అడ్డు అదుపు లేదు. వాహనాలన్నీ ఒక్కసారిగా దూసుకొస్తుండటంతో తరచూ ట్రాఫిక్ జామ్ అవుతోంది. యవకులు సాయంత్రం పూట బైకులపై అతివేగంగా వెళ్తున్నారు. వీరి నియంత్రణకు స్పీడ్ బ్రేకర్లు అవసరం.

– ఆసిఫ్‌ఖాన్, న్యాయవాది మార్కాపురం



బైక్‌పై ట్రిపుల్ రైడింగ్